క్లుప్తంగా

ధనమ్మ తల్లికి పూజలు

కపిలేశ్వరపురం: కేదారిలంక గ్రామ శివారు వీధి వారిలంకలో ధనమ్మ తల్లిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆధ్యాత్మికంగా ప్రసిద్ధి చెందిన ధనమ్మమర్రికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆదివారం సెలవు కావడంతో రద్దీ నెలకొంది. ఆడపడుచులు అమ్మవారికి పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

ముగిసిన జాతర

అంగర చేనేత కాలనీ సమీపంలో విజయ దుర్గాంబిక అమ్మవారి జాతర మహోత్సవాలు ముగిశాయి. అమ్మవారికి నైవేద్య సమర్పణతో ఉత్సవాలు ముగిసినట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

కపిలేశ్వరపురం: రూ.ఐదు లక్షల ఆదాయం పైబడిన దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన ఆలయ కమిటీ సభ్యుల్లో ఒకరిని నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి నియమించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని నాయీ బ్రాహ్మణ సంఘం నాయకుడు, తాతపూడి మాజీ సర్పంచ్ వెన్నేటి సత్యనారాయణ అన్నారు. తరతరాలుగా భగవంతుని సేవలో కొనసాగుతున్నప్పటికీ సరైన గుర్తింపు దక్కలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌తో నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి సామాజికంగా గుర్తింపు దక్కుతుందని సత్యనారాయణ అన్నారు.

ఘనంగా బల్లల పండగ



రాయవరంలో వీరభద్రుడు, వీరగనికమ్మలను ఊరేగిస్తున్న రజకులు

రాయవరం: రజకులు ఏడాదికోసారి జరుపుకొనే బల్లల పండగను ఆదివారం రాయవరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బల్లల పండగను ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. ఇందులో భాగంగా మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో వీరభద్రుని ఊరేగింపు చేపట్టారు. వీరభద్రుడు, వీరగనికమ్మ ప్రతిమలను శిరస్సుపై ధరించి రజకులంతా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం జమ్మిచెట్టు వద్ద, అలాగే నిత్యం దుస్తులను శుభ్రం చేసుకునే చెరువు వద్దకు వెళ్లి బల్లలకు పూజలు చేశారు.

నేడు వీరభద్రస్వామి మహా సంబరం



వీరభద్రస్వామి విబూది పండ్లు, గనికమ్మ అమ్మవార్ల విగ్రహాలు

రామచంద్రపురం: స్థానికంగా వీరభద్రస్వామి మహా సంబరాన్ని సోమవారం జరుపనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కుమ్మర్ల వీధి పెద్దగద్ది నుంచి ప్రధాన రహదారి మీదుగా సుమారు 3 వేల మందికి పైగా భక్తులు వీరభద్రస్వామిని శిరస్సున ధరించి డోలు, సన్నాయి, కేరళ వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహిస్తారన్నారు. అనంతరం కుమ్మర్లవీధిలో అన్నసమారాధన ఉంటుందన్నారు.

అవసరం మేరకే పురుగు మందులు వాడాలి

కాజులూరు: పంటలపై సోకే తెగుళ్లు, పురుగుల ఉధృతిని బట్టి రైతులు ఎరువులు, పురుగు మందులు వినియోగించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయాధికారులు పర్యటించి రైతులకు సూచనలు చేశారు. దుగ్గుదుర్రులో ఆయన మాట్లాడుతూ పంటలపై రైతులు అవసరానికి మించి పురుగు మందులు వాడుతున్నారని, దానివల్ల ప్రయోజనం ఉండదన్నారు. ఫలితంగా ఖర్చులు పెరిగి రైతుల నికర ఆదాయం తగ్గుతుందని, మిత్ర పురుగులు చనిపోయి పంటకు మరింత హాని జరుగుతుందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం సమకూర్చుకునే విధానాలను రైతులకు వివరించారు. వ్యవసాయ సహాయకులు వి.కనకదుర్గ, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో కళాశాల బృందం

రామచంద్రపురం: స్థానిక వీఎస్ఎం అటానమస్ కళాశాలలో ఇన్ఫోసిస్ బీపీఎం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 99 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అన్సారీ తెలిపారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలో ఉద్యోగ అర్హత సాధించారన్నారు. ఎంపికైన వారిని కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ మూర్తి అభినందించారు.

అందాలకు నెలవు.. పంగిడి చెరువు

- అభివృద్ధికి మార్గం సుగమం
- త్వరలోనే మంచి రోజులు

మండపేట: పంగిడి చెరువుకు మంచి రోజులు రానున్నాయి. జగనన్న కాలనీలో శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజల తాగునీటి అవసరాలకు ఈ చెరువు కీలకం కానుంది. చుట్టూ పచ్చని తోటలు, మెట్ట భూముల నడుమ ఆహ్లాదకరంగా ఉండే ఈ చెరువు పర్యాటకంగానూ అభివృద్ధి చెందనుంది. ద్వారపూడిలోని మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో పంగిడి చెరువు ప్రధానమైంది. 69 ఎకరాల్లో విస్తరించి ఉన్న దీనిని పట్టించుకునే వారు లేక దాదాపు పదెకరాలు ఆక్రమణలకు గురైనట్టు అంచనా. గతంలో ఏడు మీటర్లకు పైగా వెడల్పు ఉండే చెరువు గట్టు ఆక్రమణలతో కుచించుకుపోతోంది. చెరువు చుట్టూ పామాయిల్, జీడిమామిడి తోటలు, పలు రకాల పక్షిజాతులతో ఇక్కడి వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. కార్తిక .మాసంలో ఇక్కడ వన సమారాధనలు ఏర్పాటు చేసుకుంటున్నా తాగునీరు, ఇతర వసతులు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు అంటున్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. గత ప్రభుత్వంలో నీరు– చెట్టు పథకం కింద చెరువులోని విలువైన గ్రావెల్ మట్టిని కొందరు టీడీపీ నేతలు కొల్లగొట్టుకు పోయారే తప్ప, చెరువు అభివృద్ధిని పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు.



పంగిడి చెరువు వద్ద విహరిస్తున్న కొంగలు

శరవేగంగా కాలనీ ఏర్పాటు

పంగిడి చెరువు సమీపంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీ శరవేగంగా రూపుదిద్దుకుంటోంది. మండపేట పట్టణ, మండలంలోని 6,610 మంది లబ్ధిదారులు ఇక్కడ ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షించి పనులు వేగవంతం చేయిస్తున్నారు. దాదాపు 25 వేల మంది జనాభాతో ఈ ప్రాంతం మినీ టౌన్‌షిప్‌గా మారనుంది. ఇక్కడ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు పంగిడి చెరువు కీలకమవుతుందని అధికారులు భావిస్తున్నారు. వర్షాకాలంలో రాజానగరం మండలంలోని ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటితో ఈ చెరువు పొంగి ప్రవహిస్తుంది. తీవ్ర వర్షాలు కురిసినప్పుడు ద్వారపూడి గ్రామాన్ని ఈ చెరువు నీళ్లు ముంచెత్తుతాయి. ఈ సమస్యను పరిష్కరించి, చెరువులోకి గోదావరి జలాలను మళ్లించే ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. చెరువు గట్టును పార్కుగా అభివృద్ధి చేసే ఆలోచన చేస్తున్నారు. త్వరలోనే ఈ చెరువుకు మంచి రోజులు వస్తాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఆక్రమణలతో కుచించుకుపోతున్న గట్టు

సుందరీకరణకు చర్యలు



జగనన్న కాలనీ సమీపంలోనే పంగిడి చెరువు ఉంది. స్థానిక ప్రజల అవసరాల దృష్ట్యా భవిష్యత్తులో చెరువును అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం. అమృత్ సరోవర్ పథకంలో చెరువు సుందరీకరణకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

–ఐ.రాజు, ఎంపీడీఓ, మండపేట

అపూర్వ కలయిక.. ఆనందాల వేదిక



రాఘవేంద్రరావును సత్కరిస్తున్న బిక్కిన వంశీయులు

రామచంద్రపురం రూరల్: బిక్కిన వంశీయుల మూడో ఆత్మీయ కలయిక ఆదివారం చోడవరం గ్రామంలో అట్టహాసంగా జరిగింది. అమలాపురానికి చెందిన డాక్టర్ బిక్కిన రాఘవేంద్రరావు అధ్యక్షతన జరిగిన వేడుకకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి మూడు వేల మంది బిక్కిన వంశీయులు హాజరయ్యారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకుంటూ ఉదయం నుంచి ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. తమ ఉన్నతికి దోహదపడిన పెద్దలను స్మరించుకుని వారికి నివాళులర్పించారు. అనంతరం బిక్కిన సూర్యభాస్కర్, ప్రొఫెసర్ బిక్కిన బాలకృష్ణలు రూపొందించిన వందేళ్ల బిక్కిన చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ మార్కులు సాధించిన అభినవ్, భోపాల్‌లో జరిగిన ఈత పోటీల్లో వెండి పతకం సాధించిన సాయివిహార్, బిక్కిన కుటుంబం లోగోను డిజైన్ చేసిన రత్నకిరణ్, నిర్వాహకులను ఘనంగా సత్కరించారు. సీనియర్ జర్నలిస్ట్ బిక్కిన శివరామ్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన కార్యక్రమంలో నీలయ్య, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఓటు హక్కు పొందాలి

పెదపూడి: అర్హులంతా ఓటు హక్కు పొందాలని తహసీల్దార్ టి.సుభాష్ అన్నారు. ఆదివారం జి.మామిడాడలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పోలింగ్ బూత్ లెవిల్ అధికారులు నిర్వహిస్తున్న విధులను ఆయన పరిశీలించారు. స్థానికంగా పర్యటించి ప్రజలకు ప్రత్యేక ఓటర్ల నమోదుపై అవగాహన కల్పించారు. ప్రజలు ఓటరు కార్డుకు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలన్నారు. అనుసంధానం చేసుకోని వారి ఆధార్ నంబర్లు స్వీకరించారు. ఓటుకు సంబంధించిన సవరణలు, మార్పులు, చేర్పులు ఉంటే బీఎల్‌వోకు వివరాలు తెలియజేసి మార్చుకోవాలన్నారు. వీఆర్వో లింగం రామ్మోహన్‌రావు, సూపర్‌వైజర్ శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



జి.మామిడాడలో ఓటు హక్కుకు దరఖాస్తు స్వీకరిస్తున్న వీఆర్వో, పక్కన తహసీల్దార్ సుభాష్

మానవతా విలువలు పెంచేందుకు కృషి



రాజుబాబుకు కరపత్రాన్ని అందజేస్తున్న జమాతే సభ్యులు

మండపేట: సమాజంలో మానవతా విలువలు, జవాబుదారీతనం పెంపొందించేందుకు జమాతే ఇస్లామి హింద్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు అన్నారు. జమాతే చేపట్టిన మానవత– నైతికత జాగరణ ఉద్యమంలో భాగంగా స్థానికంగా ఆటో ప్రచారాన్ని ఆదివారం సంస్థ రాష్ట్ర కార్యదర్శి ఎంఎమ్ షరీఫ్ ప్రారంభించారు. అనంతరం రాజుబాబు, పట్టణంలోని పలువురు ప్రముఖులను కలసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఉద్యమ కన్వీనర్ అమీర్, జమాత్ సభ్యులు జైనులాబిదీన్, కమాల్, ఆతిఖ్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

భూములకు రక్షణ కల్పించాలి

కాజులూరు: మండలంలోని దేవాలయ భూములకు రక్షణ కల్పించాలని మండల బీజేపీ అధ్యక్షుడు సలాది వీరవెంకట సత్యనారాయణ కోరారు. ఆదివారం మంజేరులో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుణ్యమంతుల శివాజీ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పలు దేవాలయాలకు చెందిన వందలాది ఎకరాల సాగుభూమి మండలంలో ఉందన్నారు. ఇందులో అధిక శాతం దశాబ్దాల తరబడి బినామీల పేరుతో ఒకే కుటుంబం ఆధీనంలో ఉండగా కొందరు దేవాలయ అధికారుల అనుమతులు లేకుండా సదరు భూములను రొయ్యల చెరువులుగా మార్చి వ్యాపారాలు చేస్తున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు పోతుల వీరబాబు, శంకరప్రియ పాల్గొన్నారు.

పీడీ యాక్టు నమోదుకు చర్యలు

మండపేట: మండపేట పట్టణంలో ఇంటి యజమానులను బ్లాక్ మెయిలింగ్ చేసి అక్రమ వసూళ్లకు పాల్పడిన గాడు సత్యనారాయణపై పీడీ యాక్టు నమోదుకు చర్యలు తీసుకుంటున్నట్లు రామచంద్రపురం డీఎస్పీ బాలచంద్రారెడ్డి వెల్లడించారు. ఆదివారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ ఈ కేసులో మరో నిందితుడు హుస్సేన్ పరారీలో ఉన్నాడని తెలిపారు. పట్టణంలో ఈ తరహా బాధితులు అధికంగా ఉన్నట్టు తెలిసిందన్నారు. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే అందిన మరో రెండు ఫిర్యాదులపై కేసులు నమోదుకు చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ చెప్పారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసరావు

రంగంపేట: విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నల్లమిల్లిలోని గ్లోబల్ విజన్ స్కూల్ వద్ద స్పోర్ట్స్ డేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆటలతో శారీరక దృఢత్వం పొందవచ్చన్నారు. అనంతరం కబడ్డీ, చెస్, క్యారమ్స్, వాలీబాల్ తదితర పోటీల్లో సుమారు 150 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు స్పోర్ట్స్ అథారిటీ ఏపీ డైరెక్టర్ జి.అలేఖ్యతో కలసి బహుమతులు అందజేశారు. వైస్ ఎంపీపీ మట్టా శ్రీను, సర్పంచ్ తుట్టా శివశంకర్ ఆనంద్, ఎంపీటీసీ సభ్యుడు మేడిశెట్టి సుబ్బన్న, స్కూల్ కరస్పాండెంట్ ముప్పిడి జాన్ డీన్, బిక్కవోలు చారిటబుల్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

రంగంపేట : ఉచిత వైద్య శిబిరాల్లో వైద్యులు అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. రంగంపేటలో ఎన్టీఆర్ ట్రస్ట్, శ్రీధరణీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావుతో కలసి ఆయన ప్రారంభించారు. శ్రీధరణీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ టి.రామరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత రోగులకు ఖరీదైన వైద్య సేవలు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. పది విభాగాల వైద్యులు సుమారు వెయ్యి మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి దాదాపు రూ.లక్ష విలువైన మందులను అందజేశామన్నారు. రాజమహేంద్రవరం జీఎస్ఎన్ న్యూరో ఆసుపత్రి డాక్టర్ గోరంట్ల రవికిరణ్, కిమ్స్ బొల్లినేని ఆసుపత్రి డాక్టర్ రేవంత్, రాజవోలు ఐ కేర్ డాక్టర్ డి.సతీష్ కుమార్, రాజానగరం లెనోరా, జీఎస్ఎల్, క్యాన్సర్ ఆసుపత్రుల వైద్య బృందం సేవలు అందించారు. వైద్యులు గురుప్రసాద్, సాయిప్రతాప్, రేవంత్, బాల, సిబ్బంది సుబ్బారావు చౌదరి, ఆదిలక్ష్మి, జేడీ కర్ణ, ఎన్టీఆర్ ట్రస్ట్ హెల్త్ ఇన్‌చార్జి శ్రీకాంత్ పాల్గొన్నారు.



రంగంపేటలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు

విశ్వనాథ్‌తో అనుబంధం మరువలేనిది

రామచంద్రపురం: దివంగత సినీ దర్శకుడు కె.విశ్వనాథ్‌కు ఈ ప్రాంతం అంటే ఎంతో మమకారమని, ఆయనతో తమకు ఎంతో అనుబంధం ఉందని సినీ నిర్మాత ఉజూరి వీర్రాజు, దర్శకుడు, నటుడు కర్రి రామారెడ్డి అన్నారు. దర్శకులు కె.విశ్వనాథ్, సాగర్‌ల మృతికి చింతిస్తూ స్థానిక గీతా థియేటర్ వద్ద సంతాప సభ ఏర్పాటు చేశారు. విశ్వనాథ్, సాగర్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జననీ జన్మభూమి, సిరిసిరి మువ్వ, సిరివెన్నెల, స్వాతికిరణం తదితర సినిమాలను రామచంద్రపురం పరిసర ప్రాంతాల్లో తీసే సమయంలో విశ్వనాథ్ తన స్నేహితులు కర్రి లచ్చారెడ్డి, భాస్కర రెడ్డి తదితరుల ఇంటి వద్దే ఉండి షూటింగ్ చేసేవారన్నారు. ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటు అని అన్నారు. ఏజీపీ పిల్లి మురళీమోహన్, పలువురు అభిమానులు పాల్గొన్నారు.



విశ్వనాథ్, సాగర్‌ల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న వీర్రాజు, రామారెడ్డి తదితరులు

మహా రుద్రయాగం ప్రారంభం



శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



మహా రుద్రయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

రాయవరం: సోమేశ్వరంలోని చారిత్రక శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పంచాయతన మహా రుద్రయాగం ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 23వ తేదీ వరకూ ఈ యాగం కొనసాగనుంది. బ్రహ్మశ్రీ చంద్రాభట్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో వింజమూరి శ్రీరామ సుబ్రహ్మణ్యశర్మ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ, కందర్ప కామేశ్వరశర్మ, వింజమూరి వీరభద్రం, పెద్దింటి శేషాచార్యుల సమక్షంలో ఉదయం 7.45 గంటలకు గణపతి పూజతో మహా రుద్రయాగం ప్రారంభించారు. మహన్యాస పూర్వక రుద్ర జపాభిషేకాలు, సూర్య నమస్కారాలు, చండీ మంత్రానుష్టానం, గణపతి, విష్ణు మంత్రానుష్టానాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం చండీ సప్త శతీ హోమం , రుద్ర హోమం తదితర పూజలు జరిగాయి. సరిగ్గా 22 ఏళ్ల కిందట ఇదే రోజున మహా రుద్రయాగాన్ని నిర్వహించామని, రెండో సారి తిరిగి జరపడం గర్వంగా ఉందని మహా రుద్రయాగ కమిటీ తెలిపింది. గ్రామంలోని అన్ని వర్గాలకు చెందిన భక్తులు కమిటీగా ఏర్పడి ఈ యాగాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలల్లో యాగాలు ప్రారంభమయ్యాయి. సోమేశ్వరం, పరిసర గ్రామాలతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రుద్రయాగంలో పాల్గొన్నారు. రుద్రయాగ కమిటీ ఆధ్వర్యంలో యాగానికి హాజరైన భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

సత్తెమ్మ తల్లికి బోనాల సమర్పణ



అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

మండపేట: స్థానిక రాజీవ్ గృహకల్ప కాలనీలో వేంచేసి ఉన్న సత్తెమ్మ తల్లి సంబరాల్లో భాగంగా అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. సత్తెమ్మతల్లి ఆలయ 7వ వార్షికోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ రెండు రోజులుగా సంబరాలు నిర్వహిస్తోంది. ఆదివారం గరగ నృత్యాలు, తీన్‌మార్ వాయిద్యాలతో గ్రామోత్సవం జరిగింది. మహిళా భక్తులు బోనాలతో అమ్మవారికి మొక్కుబడులు సమర్పించుకున్నారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

పేకాట శిబిరంపై దాడి

మండపేట: ద్వారపూడి శివారు వేములపల్లిలో పేకాట శిబిరంపై ఆదివారం రూరల్ పోలీసులు దాడి చేసి భారీ మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆ గ్రామంలోని నల్లమిల్లి శ్రీనివాసరెడ్డికి చెందిన పామాయిల్ తోటలో పేకాట ఆడుతున్నట్టు అందిన సమాచారంపై ఎస్ఐ శివకృష్ణ సిబ్బందితో కలసి దాడి చేశారు. నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 1,32,700 నగదు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

పంటలపై ఎలకొట్టుడు

- ముప్పతిప్పలు పెడుతున్న మూషికాలు
- త్వరలో బ్రోమోడయోలిన్ మందు పంపిణీ

రాయవరం: రైతులకు ప్రధాన శత్రువు ఎలుక. చిన్నప్రాణి అయినా పంటలకు చేసే నష్టం పెద్దదే. ఎలుక తినేదాని కన్నా ఎనిమిది రెట్లు వరకూ ధాన్యాన్ని పాడు చేస్తుంది. ఈ ఏడాది కూడా ఎలుకలు వరి పైరుపై దాడి చేసి నష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం రబీ వరి పంట దుబ్బు దశలో ఉంది. మరి కొద్ది రోజుల్లో చిరుపొట్ట దశకు చేరుకుంటుంది. ఎలుకల దాడి కారణంగా రైతులు ఏటా పంట దిగుబడిని కోల్పోతున్నారు. ఏటా ఖరీఫ్, రబీల్లో ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును ప్రభుత్వం రైతులకు ఉచితంగా సరఫరా చేస్తోంది. ఈ ఏడాది కూడా వ్యవసాయ శాఖ మూషికాల నివారణకు బ్రోమోడయోలిన్ మందును సరఫరా చేయనుంది.

రెండు క్లస్టర్ల పరిధిలో..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాల్లో 1.02 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. రబీలో 95 శాతం మేర వెదజల్లు విధానమే చేపట్టారు. మిగిలిన ఐదు శాతం మాత్రం సాధారణ పద్ధతిలో వరి నాట్లు వేశారు. రైతులు అధిక శాతం ఎంటీయూ 3626 (బొండాలు) రకాన్ని సాగు చేయగా, తక్కువ విస్తీర్ణంలో 1001, 1010 తదితర రకాలను వేశారు.

వరి పంటకు తీవ్ర నష్టం

ఎలుకలు వరి దుబ్బులను కొరికి పంటకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. వీటిని అదుపు చేయడానికి రైతులు అనేక మార్గాలను అనుసరిస్తున్నారు. ప్రస్తుతం వరి పంట దుబ్బు కట్టే దశ నుంచి చిరుపొట్ట పోసుకునే దశకు చేరుకోనుంది. వరి నారుమడి దశ నుంచి ఎలుకలు రైతులను ఇబ్బంది పెడుతున్నాయి. వరి దుబ్బులను అదేపనిగా కొరికి వేయడంతో పంటకు నష్టం కలుగుతుంది. రైతులు ఎలుకలను బుట్టల సహాయంతో, పొగపెట్టే విధానంలో మట్టుబెట్టే చర్యలు చేపడుతున్నారు. బెడద ఎక్కువగా ఉండడంతో ఎలుకలు పట్టేవారికి డిమాండ్ పెరిగింది. ఎలుకలు పట్టడానికి ఎకరానికి సుమారు వెయ్యి నుంచి రూ.2 వేల వరకూ ఖర్చు అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. అందుకే ఏటా పైరు చిరుపొట్ట దశకు ముందుగానే ఎలుకల నివారణకు ప్రభుత్వం బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా సరఫరా చేస్తోంది.

ఉచితంగా సరఫరా..

వ్యవసాయ శాఖ ఖరీఫ్, రబీ సీజన్లో ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును రైతులకు ఉచితంగా సరఫరా చేస్తోంది. జిల్లా అంతటా ఒకేసారి అందిస్తుంది. ఇందులో భాగంగా క్లస్టర్ పరిధిలోని రైతులకు బ్రోమోడయోలిన్‌ను సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టింది. ఆయా పంచాయతీల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల వద్ద దీనిని పంపిణీ చేయనుంది. బ్రోమోడయోలిన్‌ను ఎరతో కలిపి ఉచితంగా అందజేయనుంది. తద్వారా సామూహికంగా ఎలుకల నివారణ చేపడితే ప్రయోజనం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



ఎలుకల దాడిలో దెబ్బతిన్న వరి పంట

సద్వినియోగం చేసుకోండి



ప్రస్తుతం ఎలుకల ఉధృతి అధికంగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. జిల్లా అంతటా ఒకేసారి బ్రోమోడయోలిన్ మందును రైతులకు ఏటా రెండు సీజన్లలో ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోంది. రైతులంతా ఒకేసారి మందును పొలాలుగా చుట్టి వేయడం వల్ల ఆశించిన ఫలితం వస్తుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అధికారుల నుంచి ఆదేశాలు రాగానే, మందును సరఫరా చేస్తాం.

–కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

వంతెన.. అవస్థల మాటున

కాజులూరు: తణుకువాడ– మంజేరు గ్రామాల మధ్య కోరంగి కెనాల్‌పై దొరగారిపాలెం వద్ద నిర్మించిన వంతెన అసంపూర్తిగా మిగిలిపోయింది. సుమారు 12 ఏళ్ల కిందట జిల్లా పరిషత్ నిధులు రూ 2.80 లక్షలతో అధికారులు వంతెన నిర్మాణం చేపట్టారు. నిధులు సరిపడకపోవడంతో కాలువపై స్లాబ్ ఏర్పాటు చేసి ఇరువైపులా అప్రోచ్, రక్షణ గోడల నిర్మాణాలను వదిలివేశారు. దీంతో వంతెన అసంపూర్తిగా దర్శనమిస్తుంది. వాహన రాకపోకలకు అవకాశం లేకపోవడంతో స్థానికులు కనీసం సైకిల్, మోటార్ సైకిల్ వంటి వాహనాలపై వెళ్లే ఉద్దేశంతో వంతెనకు ఇరువైపులా గ్రావెల్ మట్టి వేసి రాకపోకలకు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే రక్షణ గోడలు లేకపోవడంతో వాహనాలు అదుపుతప్పి పంట కాలువలోకి బోల్తా పడుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. దొరగారిపాలెంలో ప్రజలు బయటి ప్రపంచంలోకి రావాలంటే ఈ వంతెన దాటి ప్రయాణించాల్సిందే. అధికారులు స్పందించి ఈ అసంపూర్తి వంతెనను పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



కోరంగి కెనాల్‌పై దొరగారిపాలెం వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెన